క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు నిష్టతో ఉపవాస దీక్షలున్న ముస్లింలు గురువారం సుఖసంతోషాలతో ఈద్-ఉల్-ఫితర్ జరుపుకోవాలని, సమాజంలో శాంతిసమానత్వం, సామరస్యం, సోదరభావం కలిగి ఉండాలని సూచించారు.

వైభవంగా పారువేట ఉత్సవం



శ్రీరంగనాథుడి పల్లకీ ఊరేగింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉగాది సంబరాలలో భాగంగా బుధవారం పారువేట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందెసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతుడై గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా గ్రామ పరిసరాలలోని గోదా చెరువుకు వెళ్లారు. చెరువులో కుందేళ్లను వదిలి పట్టుకునే పారువేట కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డితో పాటు భక్తాదులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి బోనాలు

మద్దికెర: స్థానిక హరిజన కాలనీకి చెందిన భక్తులు బుధవారం బోనాలతో ఊరేగింపుగా కసాపురం ఆంజనేయ స్వామి ఆలయానికి తరలివెళ్లారు. ముందుగా స్థానిక స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. మేళతాళాలతో బోనాలను మోసుకొని కాలినడకన 5 కి.మీ దూరంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారికి సమర్పించడం పూర్వం నుంచి ఆచారంగా వస్తుందని, ఆంజనేయ స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటామని కాలనీవాసులు తెలిపారు.

బాట సవారమ్మ దేవర

పత్తికొండ రూరల్: పత్తికొండ-ఆదోని రోడ్డులో కొలువైన గ్రామదేవత బాటసవారమ్మ దేవర మహోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు ఊరేగింపుగా బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తాదులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకున్నారు.

చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

తుగ్గలి: మండల పరిధిలోని కడమకుంట్లలో చౌడేశ్వరీదేవి ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అలాగే తుగ్గలిలో చెన్నకేశవస్వామి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం పార్వేట నిర్వహించారు.

ఘనంగా వసంతోత్సవం

హొళగుంద: మండలంలో బుధవారం ఉగాది కరి పండుగ (వసంతోత్సవం) ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగ మరుసటి రోజు జరిగే కరి పండుగ నాడు ఈ ప్రాంతంలో హోలీ ఆడడం సాంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా ఆయా గ్రామాలలో చిన్నారులు, యువకులు చిన్నాపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగు నీళ్ల చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పిండి వంటలు, విందు భోజనాలతో కరి వేడుకను సంబరంగా చేసుకున్నారు. ఉగాది కరి పండుగను చెడు దినంగా భావించే ఇక్కడి ప్రజలు పనులన్నీ వాయిదా వేసుకుని ఇంట్లోనే కాలక్షేపం చేశారు.

దరఖాస్తు చేసుకోండి

మద్దికెర: మద్దికెర మేజర్ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహించేందుకు సిబ్బంది కావాలని ఆసక్తిగల వారు సంప్రదించాలని సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు బుధవారం తెలిపారు. గ్రామంలో వీధి బల్బులు మార్చడం తదితర పనులు చేయవలసి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు వేతనం ఉంటుందని తెలిపారు.వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించండి

నందవరం: మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. నిర్దిష్ట కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వేతనం అందుతుందని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రంజాన్ ప్రశాంతంగా జరుపుకోండి

హొళగుంద: రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పెద్దయ్యనాయుడు సూచించారు. ఆయన బుధవారం మండలంలోని ఈద్గాలు, మసీదులను పరిశీలించి మత పెద్దలకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ తమ ఆచారాలను గౌరవించుకుంటూ కులమతాలకు అతీతంగా పండుగను జరుపుకోవాలన్నారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ పీరా వెంట ఉన్నారు.

నామినేషన్లలో నిబంధనలు పాటించాలి

- ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్
- 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ



ఆలూరు నియోజకవర్గ చిత్రం

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్ సూచించారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు గడువు ఉందన్నారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన, 29వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ పూర్తవుతుందని చెప్పారు. మే 13న ఎన్నికలు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 76 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. వాటి వద్ద వెబ్ కాస్టింగ్, అబ్జర్వర్ల నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సర్వీస్ ఓటర్లు, విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అంశాలపై అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నిబంధనల మేరకు ఏర్పాట్లు

ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థి వెంట మూడు వాహనాలకే అనుమతి ఇస్తామన్నారు. ఆర్ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో వాహనాలను నిలుపుకోవాలని సూచించారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని కేంద్రం లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో అభ్యర్థి నాలుగు నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉందని చెప్పారు. అఫిడవిట్, ఓటు ధ్రువీకరణ పత్రం, పార్టీ బలపరిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా పత్రాలను నామినేషన్‌తో పాటు సమర్పించాల్సి ఉందన్నారు. అభ్యర్థిపై క్రిమినల్ కేసులు ఉంటే పత్రికలు, టీవీ ఛానల్స్‌లో ముందస్తుగా ప్రకటన ఇవ్వాలన్నారు.

పక్కాగా కోడ్ అమలు



రామునాయక్ ఆర్వో, ఆలూరు

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు ప్రతి మండలంలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో కంట్రోల్ రూమ్, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారులను నియమించినట్లు చెప్పారు. అభ్యర్థులు ప్రచారం చేసేందుకు ముందుగానే అనుమతులు తీసుకోవాలన్నారు. సీ- విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు వంద నిమిషాల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 85 ఏళ్ల పైబడిన వారు, 40 శాతం వైకల్యం కలిగిన వారిని పరిశీలించి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



మాట్లాడుతున్న తెర్నేకల్ సురేందర్ రెడ్డి

ఆస్పరి: ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి గెలుపునకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్ సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మండలంలోని ముత్తుకూరు, పుటుకలమర్రి, బిల్లేకల్లు, ములుగుందం గ్రామాలలో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. సర్పంచ్ తోయజాక్షప్ప, నాయకులు శివారెడ్డి, హనుమంత రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దాహార్తి ముప్పు తప్పినట్లే!

- పూర్తిస్థాయిలో ఎస్ఎస్ ట్యాంక్, గుడికల్ చెరువుల్లో నీటి నిల్వ
- మంచినీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకోవాలంటున్న మున్సిపల్ అధికారులు



నిండుకుండలా ఎస్ఎస్ ట్యాంక్

ఎమ్మిగనూరుటౌన్: ఈ వేసవిలో పట్టణ ప్రజలు మంచినీటి గండం నుంచి బయటపడినట్లే. తుంగభద్ర దిగువ కాలువ ద్వారా తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయడంతో గుడికల్ చెరువును నీటితో నింపారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ప్రత్యేక చొరవతో డీఈ మనోహర్ రెడ్డి, ఏఈ శరత్‌కుమార్, వాటర్ వర్క్స్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ దిగువ కాలువ నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌కు మళ్లించడంతో పాటు గుడికల్ చెరువులో సమృద్ధిగా నిల్వచేశారు. దీంతో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంచినీటి కోసం ట్యాంకర్ల వద్ద చిన్న పాటి యుద్ధమే జరిగేది. ఒక బిందె నీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడేవారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు ప్రణాళిక ద్వారా నీటి నిల్వలను పెంచారు. ఒక లక్షకు పైగా ఉన్న పట్టణ జనాభా కోసం ప్రస్తుతం గుడికల్ చెరువులో 526 మిలియన్ లీటర్ల నీటిని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో 87 మిలియన్ లీటర్ల నీటిని అధికారులు నిల్వ చేశారు. ఈ నీటిని పట్టణంలో ఉన్న ట్యాంకుల ద్వారా సరఫరా చేయడంతో పాటు దాదాపు 13,699 ఇళ్ల కుళాయిలు, 86 వాణిజ్య కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంక్, గుడికల్ చెరువులో ప్రస్తుతం ఉన్న నీటితో పట్టణవాసులకు నెలన్నరకు పైగా తాగునీటిని అందించవచ్చని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే పులికనుమ రిజర్వాయర్ ద్వారా మరోసారి దిగువ కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తే జూలై మొదటి వారం వరకు నీటి ఇబ్బందులు తలెత్తవని మున్సిపల్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించడంతో పాటు ఉన్న బోర్లను వినియోగంలోకి తెచ్చి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



ఈ వేసవిలో ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్త కుండా తగిన చర్యలు చేపట్టాం. ఎస్ఎస్ ట్యాంక్, గుడికల్ చెరువులను పూర్తిస్థాయిలో నీటితోనింపాం. ఈ నీటితో వచ్చే రెండు నెలల పాటు మంచినీటి సమస్య తలెత్తదు. అలాగే పట్టణ ప్రజలు నీటి ని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొళాయిల ద్వారా సరఫరా అయ్యే మంచినీరు వృథా కాకుండా అవసరం మేరకు వాడుకోవాలి.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష పూర్తి చేసుకున్న ముస్లింలకు పత్తికొండలోని షాదీఖానాలో బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ముస్లిం మతపెద్దలతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి స్వయంగా భోజనం వడ్డించారు. రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, ముస్లిం మైనారిటీ నాయకులు టీఎండీ హుసేన్, అనీఫ్, చాంద్‌బాషా, కరవాల హుసేన్, నజీర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దేవర సంబరాలు



ఇబ్రహీంపురంలో భోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నందవరం: మండలంలో క్రోధి నామ సంబరాలలో భాగంగా బుధవారం గ్రామాల్లో దేవర్లు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామ దేవతలకు కుంభాభిషేకాలు కానిచ్చి వేడుకలు నిర్వహించారు. మండలంలోని నదికైరవాడి, కొత్తకై రవాడి, ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లో దేవర ఉత్సవాలు చేపట్టారు. డప్పుదరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవతలకు సమర్పించే కుంభోత్సవం ఆకట్టుకుంది. నదికైరవాడిలో మారెమ్మవ్వకు భక్తులు భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఇబ్రహీపురంలో మారెమ్మవ్వకు భక్తులు కుంభాలు సమర్పించారు. ఉదయం నుంచే అమ్మవార్లకు ఆయా గ్రామాల్లో కుంభోత్సవం నిర్వహించారు. అనంతరం బలిదానాలు కానిచ్చారు. ఆయా గ్రామాల సర్పంచులు నాగేశ్వరరెడ్డి, ఈశ్వరమ్మ, ఎంపీటీసీ బీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేరికలపై టీడీపీ గారడీలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో సీపీఐ నుంచి వంద మంది టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్, పట్టణ, మండల కార్యదర్శులు రంగన్న, చిన్నన్న స్పష్టం చేశారు. వారు బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి టీడీపీ వారికే కొత్తగా కండువాలు కప్పి వారంతా సీపీఐ నుంచి తమ పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీపీఐలో కనీసం సభ్యత్వం లేని వారు తమ పార్టీ నాయకులు ఎలా అవుతారని ప్రశ్నించారు. తిమ్మాపురం గ్రామం సీపీఐకి కంచుకోట అని, దీన్ని విచ్ఛిన్నం చేసేందుకు బూటకపు చేరికలతో తప్పుడు ప్రచారానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సీపీఐ కార్యదర్శి వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి రాజీవ్, నాయకులు తిమ్మగురుడు, కేసీ జబ్బార్, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ఆలూరు: ఉత్సవాల పేరుతో అల్లర్లుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆస్పరి మండలం కై రుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి, కాళమ్మ ఉత్సవాలలో భాగంగా బుధవారం పిడకల సంమరం జరిగింది. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. పిడకల సమరం సందర్భంగా ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు చర్యలతో ఈ ఏడాది గయపడిన వారి సంఖ్య తగ్గిందని చెప్పారు. భక్తి పేరుతో ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు, దేవనకొండ సీఐ శ్రీనివాసులు, ఆరు మండలాల ఎస్ఐలు, పోలీసులు ఉన్నారు.

సంప్రదాయానికి ప్రతీక పారువేట ఉత్సవం



దూదేకొండలో దొరల వంశీకుడిని గుర్రంపై ఊరేగిస్తున్న గ్రామస్తులు

పత్తికొండ రూరల్: సంప్రదాయానికి ప్రతీకగా మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో బుధవారం పారువేట ఉత్సవం వైభవంగా జరిగింది. దూదేకొండ దొరల సంస్థానం పాలేగార్ చిన్న వెంకటప్పనాయుడిని గ్రామస్తులు గుర్రంపై ఊరేగిస్తూ గ్రామంలో మెరవణి ఉత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యువత కేరింతలు కొడుతూ పారువేట ఉత్సవాన్ని కొనసాగించారు. ఏటా ఉగాది పండుగ అనంతరం దొరల వంశీకులను ఇలా గుర్రంపై ఊరేగించడం అనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. ఉత్సవంలో గ్రామ రైతులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రమణీయం.. తిమ్మగురుడి ప్రభోత్సవం



అశేష జనవాహిని మధ్య తిమ్మగురుడు స్వామి ప్రభోత్సవం,



ప్రభపై స్వామి, అమ్మవారు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామంలో వెలసిన తిమ్మగురుడు స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభోత్సవాన్ని అశేష భక్తజనుల మధ్య గ్రామస్తులు కనులపండుగగా నిర్వహించారు. ఉదయమే స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి భక్తులు గ్రామ వీధుల గుండా జయజయధ్వానాలతో గ్రామ శివారులోని అంజనేయ స్వామి ఆలయం వరకు వెళ్లి స్వామివారికి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం నందికోల సేవ, పారువేట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర పౌరాణిక నాటకంతోపాటు గురువు లింగన్న ఆధ్వర్యంలో చెక్క భజన కార్యక్రమం అలరించాయి. ఫ్యాక్షన్ గ్రామం కావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గురువారం పల్లకీ సేవ, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా గుంటి రంగస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామ శివారులో వెలసిన గుంటి రంగస్వామి తిరునాలను గ్రామస్తులు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. తిరునాల సందర్భంగా గ్రామంలో మిఠాయి, గాజుల దుకాణాలు వెలిశాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



హాజరైన అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి



ఆలూరులో మాట్లాడుతున్న ఆర్ఓ డి.రామునాయక్

పత్తికొండ రూరల్: ఎన్నికల విధుల్లో పీఓ, ఏపీఓలు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పత్తికొండ ఆర్డీఓ నీలపు రామలక్ష్మి అన్నారు. బుధవారం గోపాల్ ప్లాజాలో పోలింగ్ విధులపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్‌కు ముందు కేంద్రంలో ఏజెంట్ల పర్యవేక్షణలో మాక్‌పోలింగ్, కౌంటింగ్ నిర్వహించాలని సూచించారు. ఓటు వేయడం, వేసిన ఓటు ఎవరికి పడిందనే నిర్ధారణ తదివార వాటిని పరిశీలించిన తర్వాత పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తే ఎలాంటి సందేహాలకు తావుండదన్నారు. పోలింగ్ సామగ్రిని కేంద్రానికి తరలించడం నుంచి తిరిగి అప్పగించేంత వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్లు మాధవరావు, అనురాధ, షర్మిల, రజాక్‌వలి, అనంతాచారి, ఆర్డీఓ కార్యాలయం ఎన్నికలడీటీ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని నియోజకవర్గ రిటర్నింగ్ ఆధికారి చిరంజీవి సూచించారు. బుధవారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓలు, ఏపీఓ, ఓపీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ.. ఎన్నికల సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూసుకోవాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, పీఓ హ్యాండ్ బుక్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం బుక్ లెట్‌ను పూర్తిగా చదవాలని సూచించారు. లోక్‌సభ, శాసన సభ పోలింగ్, మార్క్‌డ్ కాపీ బాధ్యతలపై అవగాహన కల్పించారు. పోలింగ్ ముందు రోజు సామగ్రిని తీసుకోవడం, వాటిని పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ ఏజెంట్ల నియామకం, మాక్ పోలింగ్, టెండర్ ఓటింగ్, ఓటర్ స్లిప్‌ల పరిశీలనపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ మాత్రం పొరపాట్లకు తావిచ్చినా తదుపరి పరిణామాలకు బాధ్యులవుతారని హెచ్చ రించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎవరెవరిని అనుమతించాలన్నది బుక్‌లెట్‌లో స్పష్టంగా ఉందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎన్నికల డీటీ రఘువీరా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం ఆర్టీటీ ఆడిటోరియంలో బుధవారం ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్, ఏఆర్ఓ చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మాస్టర్ ట్రైనర్స్ బి.నాగరాజ్, ఎస్‌వి.రామకృష్ణారెడ్డి, కె.కాళప్ప, కె.నాగలింగప్ప, ఎన్నికల డీటీ గుండాలనాయక్, డీటీ రజనీకాంత రెడ్డి తదితరులు ఉన్నారు.

వాటర్ బెల్ తప్పనిసరి



ఆలూరు మోడల్ స్కూల్‌లో వాటర్ బెల్ మోగడంతో మంచినీరు తాగుతున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: అధిక ఎండలకు విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో వాటర్ బెల్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓ కోమలాదేవి సూచించారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. తరగతి గదిలో ఉండే విద్యార్థులు వడగాలులకు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు విద్యా శాఖ వాటర్‌బెల్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఉదయం 8.45 గంటలకు, 10.50 గంటలకు, 11.50 గంటలకు మూడు సార్లు వాటర్ బెల్ మోగించాలని, ఆ సమయంలో విద్యార్థులు నీరు తాగేందుకు ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి తగినంత నీరు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.